PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 145 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 22 మే 2026


## కలెక్టర్ డిఎస్ఓ అవినీతి కనిపించడం లేదా?




## పరకాలలో భారీ అగ్నిప్రమాదం తప్పించిన సిఐ క్రాంతికుమార్




# ఎబోలా వైరస్ విజృంభణ

- ఇండియా-ఆఫ్రికా సమిట్ వాయిదా
- ఎయిర్‌పోర్ట్‌లో అడ్వయిజరీ జారీ




**న్యూఢిల్లీ, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):**ఆఫ్రికాలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ వంటి దేశాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ పరిణామాల నడుమ దిల్లీ వేదికగా ఈ నెల 28-31 తేదీల మధ్య జరగాల్సిన 'ఇండియా- ఆఫ్రికా ఫోరమ్ సమిట్' వాయిదా పడింది. భారత్, ఆఫ్రికన్ యూనియన్ మిగతా2లో...

## కార్మికులకు ప్రభుత్వం
# శుభవార్త

● కనీస వేతనాలు అమలుకు నిర్ణయం ● కేబినేట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం ● లబ్దిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు ● బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు ● కెటిఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు ● మీడియా సమావేశంలో సిఎం రేవంత్



**హైదరాబాద్, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయా రని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్స్, మిగతా2లో...



## తెలుగు రాష్ట్రాల్లో
# నిప్పుల వాన

ఎండల తీవ్రతతో రికార్డు ఉష్ణోగ్రతలు
పిడుగురాళ్లలో 48.1 ముత్తారంలో 46.5 డిగ్రీలు నమోదు

**హైదరాబాద్/విజయవాడ, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):**ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. ఏపీ, తెలంగాణలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. అంతకంతకూ ఎండ తీవ్రత పెరిగిపోయి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు బయటకు అడుగుపెట్టాలంటేనే బాబోయో ఎండ అనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురిపిస్తున్నాడా అన్నట్లుగా ఉష్ణోగ్రతలు మిగతా2లో...

## కొనుగోలు కేంద్రాల్లో
# మరణమృదంగం

- రైతులు పిట్టల్లా రాలుతున్నా ధాన్యం కొనరా
- ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడండి సిఎం గారు
- 23న జరిగే కేబినేట్ భేటీలో అయినా చర్చించండి
- సిఎం రేవంత్‌కు కెటిఆర్ బహిరంగ లేఖ




## మణుగూరు-రామగుండం
# రైల్వే లైన్‌కు ఆమోదం


● రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మాణం
● మారుమూల గిరిజన పల్లెలకు పట్టనున్న మహర్దశ
● రైల్వే ప్రాజెక్టులపై అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి చర్చ



**న్యూఢిల్లీ, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో రవాణా రంగాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కీలకమైన మణుగూరు-రామగుండం కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దాదాపు రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టును పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో చేపట్టనున్నారు. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే తెలంగాణలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రైల్వే సౌకర్యం మిగతా2లో...

## రూపాయి పతనంపై ఆర్‌బిఐ దిద్దుబాటు

అధికారులతో గవర్నర్ మల్హోత్రా మంతనాలు




# ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

**కాళేశ్వరం,మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. వీరంతా తొలుత పుష్కరస్నానం ఆచరించి ప్రారంభంచారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక మిగతా2లో...

కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి రాక
పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు



## విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23మందికి చోటు

- ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మంత్రి యోగం

**చెన్నై, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే పార్టీ అధినేత విజయ్ తన కేబినెట్‌ను విస్తరించారు. కొత్తగా 23 మంది ఎమ్మెల్యేలు నేడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. 21 మంది టీవీకే ఎమ్మెల్యేలతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్‌కు చెందిన మిగతా2లో...




# దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

● సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్
● రాజీవ్‌కు నివాళి అర్పించిన సిఎం రేవంత్



**హైదరాబాద్, మే 21( పిసిడబ్ల్యూ న్యూస్):** దేశం కోసం ప్రాణాలర్పించిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. 'కంప్యూటర్, ఐటీ, టెలికామ్‌లను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్‌గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది.

మిగతా2లో...




# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

- 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిల నియామకం

**హైదరాబాద్, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోసం కేసీఆర్ ఇన్‌ఛార్జిలను ప్రక టించారు. డిజిటల్ ప్రక్రియలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు జరగనుంది. 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను బీఆర్ఎస్ అధినేత నియమించారు. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు తెలంగాణ భవన్‌లో ఐటీ నిపుణులతో డిజిటల్ శిక్షణ మిగతా2లో...

## హిందువుల మనోభావాలను
# దెబ్బతీసేలా గోవధ

● గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనలు కోకొల్లలు
● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్‌లో గోవుల అక్రమ రవాణా, వధ జరుగుతోందని అన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ కొందరు కావాలనే వాటిని ఉల్లంఘిస్తున్నారని ఆయన మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ జరుగుతోందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా2లో...

# తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వాన

(మొదటి పేజీ తరువాయి)

రోజురోజుకూ రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. గురువారం రాష్ట్రంలో పలుచోట్ల రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో అత్యధికంగా పిడుగురాళ్లలో 48.1, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్కాపురం జిల్లా కనిగిరిలో అత్యధికంగా 48.3 డిగ్రీలు నమోదు కాగా, కృష్ణా జిల్లా కంకిపాడులో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా చింతలపూడిలో 47.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు, పల్నాడు జిల్లా అచ్చంపేటలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 47.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు, బాపట్ల జిల్లా ఇంకొల్లులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఏపీలోని వేటపాలెం (బాపట్ల), నందివాడ (కృష్ణా)ల్లో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నందనమారెళ్ల (మార్కాపురం)లో 46.6, కూనవరం (పోలవరం)లో 46.5, కావలి (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు)లో 46.4, తెనాలి (గుంటూరు)లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగనుందని అధికారులు తెలిపారు. తెలంగాణ లోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్‌లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. భానుడి భగభగలతో జనం ఇంటి నుంచి కాలు బయట పెట్టడానికి భయపడుతున్నారు. ఏమైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా ఎండలకు హడలిపోతున్నారు. గత వారం నుంచి ఉదయం మొదలు కొని సాయంత్రం వరకూ తీవ్రమైన ఉక్కపోతతో పాటు సెగలు కక్కే ఎండే కనిపిస్తూ ఉండటంతో సాధారణమైన పనులు చేసుకోవడానికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈ ఎండలకు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఏసీలు ఉన్న వారు ఏసీ చాటను, ఫ్యాన్లు ఉన్నవారు ఫ్యాన్ల మాటునే సేద తీరుతూ ఊపిరి పీల్చుకుంటున్నారు. సాయంత్రం ఆరు దాటితే గానీ ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ఈ ఎండల నుంచి ఎప్పుడు ఉపశమనం పొందుతామా అని ఎదురుచూస్తున్నారు ప్రజలు.

# కొనుగోలు కేంద్రాల్లో మరణమృదంగం

**హైదరాబాద్, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర ముఖ్యమంత్రి గారూ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేబినెట్ మీటింగ్‌లోనైనా కళ్లు తెరవండి అని హితవు పలికారు. రైతుల ప్రాణాలు పోతున్నా.. పంటలు కొనరా..? కొనుగోలు కేంద్రాల్లో కుప్పకూలుతున్నా కనికరించరా అని మండిపడ్డారు. ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణ మృదంగ మేంటని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదని అన్నారు. ఇవాళ బూతులు తిడుతున్న రైతులే.. రేపు వాతలు పెడతారని హెచ్చరించారు. కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు రైతు చేతిలోనే కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు. రైతుకు రక్షణగా కేసీఆర్ అమలుచేసిన ఒక్కో పథకానికి గత రెండేన్నరేళ్లుగా పాతరేసిన మీరు మీ చేతకానితనంతో అన్నదాత వెన్నువిరిచారు. ఇవాళ మీ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయి. అష్టకష్టాలు పడి పండించిన పంటను కొనే దిక్కులేక రెండునెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆర్తనాదాలు చేస్తున్నారు. చేతకాని మీ సర్కారు నిర్వాకం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఏ మూలన చూసినా ఈరోజు రైతులు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. పంట అమ్ముకుందామనే ఆశతో వచ్చిన రైతులు రోజుల తరబడి పడిగాపులు పడలేక కొనుగోలు కేంద్రాల్లోనే గుండెపగిలి కుప్పకూలుతున్నా మీ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదు. 70 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టడంలో మీకున్న శ్రద్ధలో ఒక్క శాతం రైతులపై పెట్టి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. మీ కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీకి మూటలు మోయడం తప్ప రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనాలన్న సోయి మాత్రం మీలో కనిపించడం లేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద దాదాపు పదిమంది రైతులు వడదెబ్బకు తోడు సర్కారు చేసిన ద్రోహానికి తమ నిండు ప్రాణాలు కోల్పోయారు.

ధాన్యం కుప్పలు మీ అసమర్థతకు ప్రత్యక్ష సాక్ష్యాలు. విలువైన భూములను తెగనమ్మి వేలకోట్లు దోచుకోవాలన్న ఉత్సాహం తప్ప రైతుల పంటలను కొనాలన్న ధ్యాస మీలో ఏమాత్రం కనిపించడం లేదు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా అనేక జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రోజుకు కనీసం ఒక్కటంటే ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదు. చివరికి గన్నీ బ్యాగు కోసం రైతులే 50 రూపాయల చొప్పున డిపాజిట్ చేసే దుస్థితి తెచ్చినందుకు మీరు, మీ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి. అన్నదాతలు అడుగడుగునా పడిగాపులు పడుతుంటే వాటిని వదిలేసి, పర్యాటక వారోత్సవాలు నిర్వహించాలన్న మీ సర్కారుకు ప్రాధాన్యతలే కాదు, చివరికి సోయి కూడా లేదని తేలిపోయింది. కేసీఆర్ హయాంలో మూడు నెల ముందు నుంచే పంటల కొనుగోలు ప్రణాళికలను పకడ్బందీగా అమలుచేసేవారు.

గన్నీ బ్యాగుల నుంచి మొదలుకుని రైతుల ఖాతాల్లో పంట డబ్బులు సకాలంలో జమ అయ్యేదాకా నిరంతర సమీక్షలతో పర్యవేక్షించేవారు.

కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాల నుంచి తమ పంటను కాపాడుకునేందుకు చివరికి టార్పాలిన్లు కూడా సమకూర్చలేని మీ కాంగ్రెస్ సర్కారు ఉండి రైతులకు ఏం ప్రయోజనం అన్నారు.

రాష్ట్రమంతా రైతుల నిరసనలు హోరెత్తుతున్న ఈ తరుణంలో 23న నిర్వహించే కేబినెట్ సమావేశంలోనైనా లెంపలేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టండని కెటిఆర్ తన లేఖలో కోరారు.

# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీసవేతనం నిర్ణయించాం అన్నారు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుందని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి.. కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.

పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని అంటూ ఎద్దేవా చేశారు.

# మణుగూరు-రామగుండం రైల్వే లైన్‌కు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

దక్కడంతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు పెద్ద ఉపశమనం లభించనుంది. మొత్తం 207.8 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ సరికొత్త రైల్వే లైన్ మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాలరావుపేటలతో పాటు ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం మీదుగా వెళ్లనుంది. ప్రస్తుతం మణుగూరు నుండి రామగుండం వెళ్లాలంటే భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), కాజీపేట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కానీ, ఈ కొత్త లైన్ పూర్తయితే మణుగూరు-రామగుండం మధ్య ఏకంగా 90 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. దీనివల్ల ప్రయాణికులకు సమయం, డబ్బు భారీగా ఆదా అవుతాయి. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులకు కనెక్టివిటీ మరింత సులభతరం కానుంది. ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వెనుకబడిన మారుమూల గిరిజన ప్రాంతాలకు ఒక పెద్ద వరంగా మారబోతోంది. దశాబ్దాలుగా రైలు ముఖం చూడని ఎన్నో గ్రామాలకు ఈ లైన్ ద్వారా రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతంలో లభించే బొగ్గు, ఖనిజాలు, ఎరువులు , ఇతర పారిశ్రామిక సరుకు రవాణాకు ఈ రైల్వే లైన్ అత్యంత కీలకంగా మారనుంది. దీనివల్ల సింగరేణి బొగ్గు గనుల రవాణా మరింత వేగవంతం కానుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు రైల్వే శాఖ సరికొత్త ప్లాన్ సిద్ధం చేసింది. డీపీఆర్ తయారీ, భూసేకరణ, వివిధ ప్రభుత్వ శాఖల నుండి అనుమతులు తీసుకునే బాధ్యతలను రైల్వే శాఖ చూసుకుంటుంది. అయితే, ప్రాజెక్ట్ నిర్మాణం , నిధుల సమీకరణ పనులను ప్రైవేట్ భాగస్వామ్య సంస్థకు అప్పగిస్తారు. ఈ ప్రాజెక్ట్ టైమ్‌లైన్ ప్రకారం.. మొదటి ఏడాదిలో పూర్తిగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత నాలుగు సంవత్సరాల్లో అంటే మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ కొత్త రైల్వే లైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదిలావుంటే కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు.

# హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ

(మొదటి పేజీ తరువాయి)

గోమాత రక్షణ కోసం శాంతియుతంగా పనిచేస్తున్న గోరక్షకులు, బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. గోరక్షకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ కార్యకర్తలపై విధించిన బైండోవర్ చర్యలను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రాంచందర్ రావు సూచించారు. గోవధకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పక్షపాత ధోరణిని విడిచిపెట్టి చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు. గోమాత హిందువుల జీవన విధానంలో పవిత్రమైన భాగమని, పండుగల పేరుతో గోవధ చేస్తే సహించబోమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే శక్తులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు.

ఈ సందర్భంగా తెలంగాణలో గోవధ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన తమ కార్యకర్తలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# ఎబోలా వైరస్ విజృంభణ

(మొదటి పేజీ తరువాయి)

కలిసి ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. కొత్త తేదీలను పరస్పర సంప్రదింపుల ద్వారా ఖరారు చేస్తామని తెలిపింది. ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్యానికి సంబంధించి విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఆఫ్రికా సీడీసీ, సంబంధిత సంస్థలకు మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగశాఖ పేర్కొంది. మరోవైపు.. ఎబోలా వైరస్ వ్యవహారంలో దిల్లీ ఎయిర్‌పోర్టు అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేసిన విషయం తెలిసిందే. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, నీరసం, కండరాల నొప్పులు తదితర సమస్యలు కనిపిస్తే వెంటనే ఎయిర్‌పోర్టు వైద్యసిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎబోలా కారణంగా ఇప్పటివరకు 139 మంది మృతి చెందారు. దాదాపు 600 అనుమానిత కేసులను గుర్తించారు. కాంగోలో వైరస్ వ్యాప్తిని ఎదుర్కొనేందుకు తమకు మరింత సామగ్రి, సిబ్బంది అవసరమని అధికార వర్గాలు, సహాయక బృందాలు కోరాయి. మొదటి మరణం నమోదైన బునియా ప్రాంతానికి దాదాపు 20 టన్నుల సహాయ సామగ్రిని తరలించినప్పటికీ.. ఐసొలేషన్ గదుల కొరత కారణంగా వైద్యులు సాధారణ వార్డుల్లోనే ఎబోలా అనుమానిత రోగులకు చికిత్స అందిస్తున్నారు.

# రూపాయి పతనంపై ఆర్‌బిఐ దిద్దుబాటు

**ముంబయి, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** రూపాయి విలువను స్థిరీకరించడానికి, వడ్డీ రేట్ల పెంపుతో సహా అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పరిశీలిస్తోందని సంబంధిత అధికారులను ఉద్దేశించి 'బ్లూమ్‌బెర్గ్' గురువారం ఒక నివేదికలో వెల్లడించింది. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో సహా ఆర్‌బీఐ ఉన్నతాధికారులు వరుస అంతర్గత సమావేశాలు నిర్వహించినట్లు ఈ నివేదిక పేర్కొంది. గడిచిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో రూపాయి అంతర్గతంగా 96.95 వద్ద రికార్డు స్థాయి కనిష్టానికి పడిపోయింది. ఆ తర్వాత కోలుకుని డాలర్‌తో పోలిస్తే 96.86 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ఇండెక్స్ బలంగా ఉండటం, ముడి చమురు ధరలు అధికంగా కొనసాగడంతో డాలర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ పరిణామాల వల్లే రూపాయి విలువ చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయి, కొత్త ముగింపు రికార్డును నమోదు చేసింది. అయితే, గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి తన సర్వకాలిక కనిష్ట ముగింపు స్థాయి నుండి 41 పైసలు పుంజుకుని అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.45కు చేరుకుంది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 96.25 వద్ద బలంగా ప్రారంభమై, ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 96.45 వద్ద ట్రేడయ్యింది. బుధవారం నాటి ముగింపు ధర 96.86తో పోలిస్తే ఇది 41 పైసల రికవరీని సూచిస్తోంది.

# విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23మందికి చోటు

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, తనకు మద్దతిచ్చిన కాంగ్రెస్‌తో పాటు ఐయూఎమ్ఎల్, వీసీకే పార్టీలకు కూడా సీఎం విజయ్ కేబినెట్ బెర్తు ఆఫర్ చేశారు. అయితే, మరికొంతకాలం తరువాత ఐయూఎమ్ఎల్, వీసీకేలు కేబినెట్‌లో చేరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సీపీఐ, సీపీఎంలను కూడా సీఎం విజయ్ మంత్రివర్గంలోకి ఆహ్వానించినట్టు మంత్రి ఆధవ్ అర్జున తెలిపారు. వీసీకే చీఫ్ తోల్ తిరుమావళన్ మంత్రివర్గంలో చేరాలని తాము ఆశిస్తున్నట్టు కూడా పేర్కొన్నారు. మే 10న జరిగిన ప్రమాణస్వీకారంలో విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఇక తమిళనాడు కేబినెట్‌లో గరిష్ఠంగా 35 మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా 23 ఎమ్మెల్యేలు మంత్రులుగా చేరడంతో మంత్రి వర్గం సంఖ్య 32కు చేరింది. దీంతో, మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కే ఛాన్స్ ఉంది.

# దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సమాజం సోనియాగాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది. మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ సర్కార్ కుయుక్తులు పన్నింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింక్ పెట్టారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. మహిళా బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పు కొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వనున్నారు. సభ్యత్వ నమోదు కోసం డిజిటల్ యాప్‌ను రూపొందించారు. తెలంగాణ భవన్‌లో శిక్షణ తర్వాత.. పార్టీ జిల్లా కార్యాలయాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. డిజిటల్ సభ్యత్వ నమోదు శిక్షణ పూర్తయిన తర్వాత.. సభ్యత్వ పునరుద్ధరణను కేసీఆర్ ప్రారంభించనున్నారు.

# ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు సైతం ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తోపాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేవారు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులను 300కు పైగా ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. జూన్ 1 వరకు ప్రతిరోజు సాయంత్రం హారతి ఉంటుంది. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రాణహిత, గోదావరి నదుల్లో అంతర్వాహిణిగా సరస్వతి నది ప్రవహిస్తున్న ప్రాంతంగా కాళేశ్వరం ప్రసిద్ధి చెందింది. దేశంలో సరస్వతి నది ఉన్నది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, రెండోది కాళేశ్వరంలోనే. అక్కడ కుంభమేళా నిర్వహించటం ఆనవాయితీ. కాగా, తెలంగాణలో తొలిసారి అంత్య పుష్కరాలకు సైతం ప్రాధాన్యమిచ్చి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయటం విశేషం. ఆది పుష్కరాల్లో నది స్నానం ఆచరించటం.. పితృతర్పణాలు ఇవ్వడం ఎలా ఫలితాలొస్తాయో.. అంత్య పుష్కర సమయంలోనూ ఆయా కార్యక్రమాలతో అవే ఫలితాలుంటాయని పండితులు చెబుతున్నారు.

# కలెక్టర్ డిఎస్ఓ అవినీతి కనిపించడం లేదా?

● కేబినెట్ మంత్రి ఆదేశాలు సైతం లెక్కచేయరా..? ● కోట్ల రూపాయల ధాన్యం మాయమైనా...ఇంతటి నిర్లక్ష్యమా! ● మిల్లులపై కేసులు సరే... కస్టోడియన్ సంగతేంటి..? ● డీఎస్ఓపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ● ఉన్నతాధికారుల తీరుపై డిఓపిటిలో ఫిర్యాదు చేస్తాం ● బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**వనపర్తి, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో అకతవకలు, రైస్ మిల్లుల్లో ధాన్యం బస్తాల మాయంపై సివిల్ సప్లయ్ అధికారుల అవినీతి జిల్లా కలెక్టర్ కి కనిపించడం లేదా? అని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు.గురువారం జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ధాన్యం మాయం చేసిన మిల్లులపై కేసులు నమోదు చేశారే కానీ అన్నింటికీ బాధ్యుడైన డిఎస్ఓపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో కలెక్టర్ చెప్పాలన్నారు.నవంబర్ నెలలో టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి జిల్లాలోని వారాహి, చాముండి రైస్ మిల్లులు సీజ్ చేసి కేసు నమోదు చేశారన్నారు.ఈ రెండు మిల్లులకు డిఎస్ఓ కస్టోడీయన్ గా వ్యవహరిస్తున్నారని తెలిపారు.సరిగ్గా 6 నెలల తరువాత టాస్క్ ఫోర్స్ అధికారులు మళ్ళీ అదే మిల్లులపై తనిఖీలు జరుపగా రూ. 9 కోట్లకు పైగా ధాన్యం బస్తాలు మాయం అయినట్లు గుర్తించడం జరిగిందన్నారు.గతంలో కేసు అయినప్పటికీ రెండు మిల్లులలో ఉన్న ధాన్యాన్ని కస్టోడీయన్ గా ఉన్న డిఎస్ఓ ఎందుకు షిఫ్ట్ చేయలేదని, ఆయన అండదండలతోనే ఈ తతంగం జరిగిందని ఆరోపించారు.పైగా సీజ్ చేసిన మిల్లులో డీఎస్ఓ (కస్టోడీయన్) కు తెలియకుండా ధాన్యాన్ని తరలించడం మరియు మిల్లింగ్ చేయడం అసాధ్యం అని, దీనిపై కూడా విజిలెన్స్ అధికారులు విచారణ జరపాలన్నారు.జిల్లాలోని ఉన్నతాధికారుల అండదండలు డీఎస్ఓకు సంపూర్ణంగా ఉన్నాయని, ఉన్నతాధికారుల బంధువులకు సివిల్ సప్లయ్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించే వ్యక్తి ద్వారా భారీ ఎత్తున ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు కూడా బీసీ పొలిటికల్ జేఏసీ సేకరించడం జరిగిందని, ఉన్నతాధికారుల పరువు తీయకూడదనే సదుద్దేశంతో వారి వివరాలు బయట పెట్టడం లేదని తెలిపారు.ఇంత పెద్ద అవినీతిపరుడైన డీఎస్ఓను ఎందుకు వెనకేసుకొస్తున్నారో జిల్లా ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. తనకు అనుకూలంగా ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం పంపించడం, తనకు నచ్చని మిల్లులకు ధాన్యం కేటాయించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ డిఎస్ఓ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు.దాదాపు నాలుగైదు కొత్త రైస్ మిల్లులకు అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.సాక్షాత్తు కేబినెట్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలను సైతం లెక్కచేయకుండా జిల్లాలో సివిల్ సప్లయ్ అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.ఏకంగా సివిల్ సప్లయ్ కమిషనర్ డీఎస్ఓను సరెండర్ చేయమంటే కూడా కలెక్టర్ ఎందుకు వెనకేసుకొస్తున్నాడో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు.సివిల్ సప్లయ్ అధికారి తీరు వల్ల పలు విమర్శలు వస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా స్పందించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోకుంటే ఉన్నతాధికారుల తీరుపై ఢిల్లీలోని డిఓపిటిలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, కృష్ణప్రసాద్, యశ్వంత్, మ్యాదరి రాజు పాల్గొన్నారు.

## ఓపెన్ ఏయిర్ జైలులో 'లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్ ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ



**వరంగల్, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** ఖైదీల సంక్షేమమే ప్రధానం. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈ హెల్ప్ డెస్క్ ఖైదీలకు చట్టపరమైన సహాయాన్ని మరింత వేగంగా మరియు సులభంగా అందించే లక్ష్యంతో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలను అనుసరించి కారాగారంలో లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్కు ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.ములాఖత్ ప్రక్రియ సరళీకరణ జైలుకు వచ్చే కుటుంబ సభ్యులు, బంధువుల ములాఖత్ ప్రక్రియను సులభతరం చేయడం ఈ డెస్క్ ప్రాథమిక విధిగా నిలుస్తుందని తెలిపారు. ములాఖత్ కోసం వచ్చే సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నిబంధనలపై ఇక్కడ అవగాహన కల్పిస్తారన్నారు. ఖైదీలను కలవడానికి వచ్చే వారికి అవసరమైన చట్టపరమైన సహాయం మరియు మార్గదర్శకత్వం ఇక్కడ లభిస్తుంది అని తెలిపారు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా అర్హులైన ప్రతి ఖైదీకి ఉచితంగా లీగల్ అడ్వైజ్ (న్యాయ సలహాలు) అందించడం జరుగుతుంది అని సూచించారు. ప్రైవేట్ న్యాయవాదులను పెట్టుకోలేని వారి కోసం ప్రభుత్వ ఖర్చులతో ప్యానెల్ లాయర్లను కేటాయించే బాధ్యతను ఈ డెస్క్ తీసుకుంటుంది అని వివరించారు.బెయిల్ మరియు కేసుల అప్‌డేట్స్, కేసుల ప్రస్తుత స్థితి బెయిల్ పిటిషన్ల దాఖలు, మరియు కోర్టు ఆదేశాల గురించిన సమాచారాన్ని ఇక్కడి లీగల్ ఎయిడ్ వాలంటీర్లు మీకు అందిస్తారు.చట్టం ముందు అందరూ సమానులే. జైలులో ఉన్నంత మాత్రాన మీ ప్రాథమిక హక్కులు కోల్పోయినట్లు కాదు. ఈ హెల్ప్ డెస్క్‌ను ఒక గొప్ప అవకాశంగా భావించి, మీ సమస్యల పరిష్కారానికి దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ టి.కళాసాగర్, డిప్యూటీ సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వర స్వామి, డిప్యూటీ లీగల్ ఏయిడ్ కౌన్సిల్ పి.శ్రీనివాసరావు, జైలర్ కె.పూర్ణచందర్, డిప్యూటి జైలర్లు కె.శ్రీనివాస్, యం.సుధాకర్ రెడ్డి మరియు ఖైదీలు పాల్గొన్నారు.

## హుస్సేనిపురా లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ..





**కరీంనగర్ టౌన్ మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలోని హుస్సేనిపురా ప్రాంతానికి చెందిన పలు లబ్ధిదారులకు తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మొహమ్మద్ అబ్బాస్ సామీ పంపిణీ చేశారు. అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అబ్బాస్ సామీ మాట్లాడుతూ, పేద ప్రజలకు అండగా నిలుస్తున్న తెలంగాణ ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అవసరమైన వారికి ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాజీలేని పోరాటం

● జూన్ 7న పీలేరులో అన్నమయ్య జిల్లా మొదటి మహాసభ





**అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లి: మే 21: (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్చార్జ్ కవరకుంట్ల జయరాజ్ తెలిపారు. మదనపల్లె పట్టణంలోని ఎస్.టి.యు కార్యాలయంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రమేష్ రాయల్ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు అమరులైన విలేకరుల కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఇంటి స్థలాలు, మీడియా కమిషన్ ఏర్పాటు, పెన్షన్ సౌకర్యం, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య వంటి హక్కుల సాధనకు ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని ఆయన అన్నారు. జర్నలిస్టుల సహకారంతో మార్చి 4న జరిగిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం అయిందని తెలిపారు. వేలాదిమంది జర్నలిస్టులు విజయవాడ నగరం వీధుల్లో హక్కుల సాధనకు గళమెత్తారని వివరించారు. చలో విజయవాడ కార్యక్రమానికి హాజరైన సమాచార శాఖ మంత్రి పార్థసారథి జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందించారని వివరించారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వివరించారు. సంస్థాగతంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ను బలోపేతం చేసేందుకు స్థానిక నాయకత్వం కృషి చేయాలని వివరించారు. అనంతరం జూన్ 7న పీలేరు పట్టణంలో అన్నమయ్య జిల్లా మొదటి మహాసభ నిర్వహిస్తున్నట్లు సమావేశం తీర్మానించింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రులు, శాసనసభ్యులు, ప్రతిపక్ష నేతలను ఆహ్వానించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్ రాయల్, హిదాహితుల్లాఏఅప్ప, ఏపిబిజెఏ అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి ప్రసాద్, రమేష్ బాబు అక్రిడేషన్ కమిటీ సభ్యులు జాకీర్, మంజునాథ్, రాజు, శ్రీనివాసులు, కటారి రామయ్య, గిరి, గిరి శేఖర్, ఆంధ్రప్రభ శీను, అస్లాం, నజీర్ సాహెబ్, బాలాజి, గురు ప్రసాద్, భానుకిరణ్, రవిలు పాల్గొన్నారు.

## 49వ డివిజన్లో పెన్షన్ అప్‌గ్రేడ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● కార్పొరేటర్ ఏన్నం లక్ష్మీ ప్రకాష్ ..








**కరీంనగర్ టౌన్ మే 21(పిసి డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ 49 డివిజన్ ప్రజలకు సంబదించిన పెన్షన్స్ అప్గ్రేడ్ కార్యక్రమాన్ని గురువారం రోజున స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్పొరేటర్ ఏన్నం లక్ష్మీ ప్రకాష్ మాట్లాడుతూ పెన్షన్ అప్గ్రేడ్ కార్యక్రమం జూన్ 15 వరకు కొనసాగుతుందని, డివిజన్ లో పెన్షన్ తీసుకుంటున్నారో వారందరూ తప్పకుండా ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తీసుకుని వార్డ్ ఆఫీసర్, సంబధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 9:00 గంటల నుండి 12:00 వరకు పెన్షన్ అప్గ్రేడ్ చేయించుకోవచ్చని తెలిపారు. పెన్షన్ అప్ గ్రేడ్ టీం కార్పొరేటర్ కార్యాలయం, సనాతన దర్మం సేవా సమితిలో అందుబాటులో ఉంటారని తెలిపారు.. గురువారం రోజున దాదాపుగా 100 మంది వరకు పెన్షన్ లను వార్డు ఆఫీసర్ మండే శిరీష అప్డేట్ చేశారు. లంబు సుధాకర్ రెడ్డి, గాధగోని రమేష్, ఉమారాణి, విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో భారీ అగ్నిప్రమాదం తప్పించిన సీఐ క్రాంతికుమార్

**- సమయస్ఫూర్తితో స్పందించి ఇండియన్ గ్యాస్ గోదాంను కాపాడిన పోలీసులు**







**పరకాల, మే 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలో భారీ అగ్నిప్రమాదం తప్పిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇండియన్ గ్యాస్ గోదాం వెనుక ఉన్న పంట పొలాల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు కోసిన వరి గడ్డి, మొక్కజొన్న పంట అవశేషాలకు నిప్పంటించడంతో మంటలు వేగంగా వ్యాపించాయి.సమాచారం అందుకున్న వెంటనే పరకాల సీఐ క్రాంతికుమార్ అప్రమత్తమై తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి తీవ్రతను అంచనా వేసిన సీఐ వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చి, ఫైర్ సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తీసుకురావడానికి స్వయంగా రంగంలోకి దిగారు.సుమారు 10 నుండి 15 ఎకరాల విస్తీర్ణంలో మంటలు వ్యాపించడంతో వ్యవసాయ బావుల వద్ద ఉన్న కరెంటు మోటార్లు, పైపులు, బట్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు సమీపంలోని మామిడి తోటతో పాటు ఇండియన్ గ్యాస్ గోదాం వరకు వ్యాపించే ప్రమాదం నెలకొనగా, సీఐ క్రాంతికుమార్ సమయస్ఫూర్తితో వ్యవహరించి భారీ ప్రమాదాన్ని తప్పించారు. ఆయన చొరవతో అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.ఈ ఘటనతో పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సీఐ క్రాంతికుమార్ ధైర్యసాహసాలు, వేగవంతమైన స్పందనపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. ఘటన అనంతరం ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో కమ్ముకుపోయింది.ఈ సందర్భంగా సీఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ తీవ్ర ఎండల కారణంగా గడ్డి పూర్తిగా ఎండిపోయి ఉండటంతో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందన్నారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ..



**కరీంనగర్ టౌన్ మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని రాజీవ్ చౌక్ వద్ద మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. కాంగ్రెస్ నాయకుడు మార్క రాజా గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. ముందుగా రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, స్థానిక మాజీ కార్పోరేటర్ మాచర్ల ప్రసాద్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకే కాంగ్రెస్ కట్టుబాటు: జిల్లా కార్యదర్శి శీలం బ్రహ్మారెడ్డి

**కల్లూరు, మే 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారతరత్న, దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఖమ్మం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి శీలం బ్రహ్మారెడ్డి ముఖ్యంగా పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తల్లాడ మండల అధ్యక్షులు కాపా సుధాకర్ బాబు, జిల్లా నాయకులు కాపా మహేష్ బాబు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఇజ్జగాని శ్రీలతతో పాటు పార్టీ నాయకులు దామ స్వరూప, చల్ల ప్రతిభా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శీలం బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ దేశాన్ని ఆధునిక భారతంగా తీర్చిదిద్దడంలో రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, సమాచార సాంకేతిక రంగం, యువతకు అవకాశాల కల్పన, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం వంటి ఎన్నో సంస్కరణలకు ఆయన శ్రీకారం చుట్టారని





గుర్తుచేశారు. దేశ అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ కుటుంబం నిరంతరం సేవలు అందిస్తోందని, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ నుంచి సోనియా గాంధీ వరకు కాంగ్రెస్ నాయకత్వం దేశ సమగ్రత కోసం కృషి చేసిందన్నారు. ప్రస్తుతం ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశ ప్రజల హక్కుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని బ్రహ్మారెడ్డి కొనియాడారు. రైతులు, యువత, నిరుద్యోగులు, బలహీన వర్గాల సమస్యలను పార్లమెంట్ నుంచి ప్రజల మధ్య వరకు తీసుకెళ్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని తెలిపారు. అనంతరం ప్రతి గురువారం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ మరియు డీఎస్ఓ





**గంగాధర మే 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈ రోజు కరీంనగర్ ఆర్డీవో కె. మహేశ్వర్ , డీఎస్ఓ నర్సింగ రావు, తహసీల్దార్ రజిత మేడం , ఎంపీడీఓ దమ్మని రాము, సీఐ ప్రదీప్ కుమార్ , ఎస్ ఐ వంశీ కృష్ణ, ఐకేపీ ఏపీఎం కుమార్, పిఎసిఎస్ సీఈఓ లతో మండల పరదిలో గల దాన్యం కొనుగోళ్ళ విషయములో చేపడుతున్న చర్యలపై అలాగే సెంటర్ పరదిలో ఎదురవుతున్న సమస్యలపై కూలంకుశంగా తహసీల్దార్ కార్యాలయంలో చర్చించిన అనంతరం ఏ ఎం సి మార్కెట్ యార్డ్ నందు గల గోదాంలను పరిశీలించి అక్కడ తాత్కాలికముగా దాన్యం దిగుమతి చేయుటకు పరిశీలన చేయడం, పలు సెంటర్లలో కొనుగోలు చేసుకున్న దాన్యాన్ని ఎప్పటికి కప్పడు రైస్ మిల్లు లకు తరలించాలని, వెంట వెంటనే ఆన్లైన్ లో రైతుల వివరాలు నమోదు చేయాలని, లారీల సమస్యను రానీవకుండా చూడాలని ఏపీఎం, పిఎసిఎస్, సీఈఓ లను ఆదేశించినారు. మండల అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీనివాస్ మరియు మార్కెట్ యార్డ్ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జాప్యంపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

- **జూన్ 16 వరకు గడువు పొడిగింపుకు ప్రభుత్వ హామీ..**
- **GO 252పై విచారణ కొనసాగింపు**

**హైదరాబాద్ మే21(పీసీడబ్ల్యూ న్యూస్):** వర్కింగ్ జర్నలిస్టులకు సమాచార, పౌర సంబంధాల శాఖ జారీ చేసే అక్రిడిటేషన్ కార్డుల పునరుద్ధరణ, గడువు పొడిగింపులో జరుగుతున్న జాప్యంపై తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్ గురువారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.ప్రభుత్వం పలుమార్లు హామీలు ఇచ్చినా ఇప్పటికీ అక్రిడిటేషన్ కార్డుల రీన్యువల్ ప్రక్రియ పూర్తి కాలేదని తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ కోర్టుకు తెలియజేయడంతో ఈ అంశం మరోసారి హైకోర్టు ముందుకు వచ్చింది.మే 14న జరిగిన గత విచారణలో రాష్ట్రవ్యాప్తంగా అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులు కార్డుల పునరుద్ధరణ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫెడరేషన్ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది.గురువారం జరిగిన విచారణలో మీడియా అక్రిడిటేషన్ కార్డుల గడువును జూన్ 16,2026 వరకు పొడిగిస్తామని అదనపు అడ్వకేట్ జనరల్ కోర్టుకు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఉత్తర్వులు సాయంత్రంలోగా జారీ చేస్తామని ప్రభుత్వం ధర్మాసనానికి తెలిపింది.**కోర్టు ప్రశ్నలు.. హామీలు ఇచ్చినా ఎందుకు ఆలస్యం?** విచారణ సందర్భంగా అక్రిడిటేషన్ గడువు పొడిగింపు అవసరమైన జర్నలిస్టుల జాబితాను పిటిషనర్ల నుంచి కోరినట్లు ప్రతివాదులు కోర్టుకు తెలిపారు.దీనిపై స్పందించిన ధర్మాసనం, ఈ అంశం కేవలం పిటిషనర్లకే పరిమితం కాదని, రాష్ట్రంలోని మొత్తం జర్నలిస్టు సమాజానికి సంబంధించినదని స్పష్టం చేసింది. సమస్య అందరినీ ప్రభావితం చేస్తున్నప్పుడు కేవలం పిటిషనర్ల నుంచే జాబితా కోరడం సమంజసం కాదని వ్యాఖ్యానించింది.ఇప్పటికే డివిజన్ బెంచ్ ముందు మే 31, 2026లోపు అక్రిడిటేషన్ పొడిగింపు ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రతివాద అధికారులు అండర్‌టేకింగ్ ఇచ్చిన విషయాన్ని కోర్టు గుర్తుచేసింది. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు గడువును జూన్ 16, 2026 వరకు పొడిగించినట్లు పేర్కొంది.దీంతో కోర్టు ముందు ఇచ్చిన హామీలు, అనంతర న్యాయ ఆదేశాలకు అనుగుణంగా అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపును కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించింది.జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌తో పాటు పలువురు జర్నలిస్టులు +గా 252 మరియు దానికి చేసిన సవరణలను హైకోర్టులో సవాలు చేశారు.ప్రభుత్వ ఉత్తర్వుల అమలు, అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో జరిగిన విధానపరమైన లోపాలపై పిటిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.విచారణలో ఫెడరేషన్ తరఫున అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు.అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు జరగకపోవడం వల్ల జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అని కోర్టు ప్రశ్నించగా, బర్కత్ అలీ ఖాన్ సమగ్ర వివరణ ఇచ్చారు.రీన్యువల్ ఆలస్యం కారణంగా జర్నలిస్టులు ప్రభుత్వ శాఖలు, సచివాలయం, అధికారిక సమావేశాలు, ప్రెస్




బ్రీఫింగ్స్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వార్తల సేకరణ కోసం స్వేచ్ఛగా వెళ్లలేకపోతున్నారని కోర్టుకు తెలిపారు.ఈ జాప్యం జర్నలిస్టుల వృత్తిపరమైన విధులకు తీవ్ర ఆటంకం కలిగిస్తోందని, ఇది భావ ప్రకటన స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ వంటి ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకే సమానమని వాదించారు.వాదనలు విన్న అనంతరం పలుమార్లు హామీలు ఇచ్చినా, అండర్‌టేకింగ్‌లు సమర్పించినా ఇప్పటికీ అక్రిడిటేషన్ పొడిగింపు ఎందుకు పూర్తి కాలేదని కోర్టు ప్రతివాద అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. GO 252 మరియు దాని సవరణలకు సంబంధించిన పిటిషన్లపై తదుపరి విచారణ జూన్16,2026న జరగనుంది.

# ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థుల భవిష్యత్తుకు పట్టుకొమ్మలు ప్రవేశాలు పెంచుదాం

- **పీపీపీపీ ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం ఘనంగా నిర్వహణ**





**గంగాధర మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో గట్టుబూత్కూర్‌పీపీపీపీ ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, మదర్ కమిటీ సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల నుండి ప్రీ ప్రైమరీ మరియు ప్రైమరీ పాఠశాలలకు విద్యార్థులు సాఫీగా మారేలా చేయడం, పాఠశాలలపై తల్లిదండ్రుల్లో బాధ్యతాభావం పెంపొందించడం, పాఠశాల వయస్సు గల ప్రతి చిన్నారి చేరిక మరియు నిలుపుదల పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ కూడా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రీ ప్రైమరీ మరియు ప్రైమరీ పాఠశాలల మధ్య బలమైన అనుసంధానం ఏర్పడేలా ఈ ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలలో చేరి నిరంతర విద్యను కొనసాగించాలని సందేశం ఇచ్చారు.ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీ ఎనుగు ప్రభాకర్ రావు మాట్లాడుతూ,"విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలు పట్టుకొమ్మల వంటివి. ప్రభుత్వ పాఠశాల ప్రవేశాలను పెంచుదాం. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలి" అని పిలుపునిచ్చారు.ఈ సమావేశం మరియు ర్యాలీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజల్లో విద్యపై మరింత చైతన్యం కలిగించాయి.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, శ్రీ సత్యప్రకాశ్ సర్, శ్రీమతి చంద్రకళ, సిఆర్పి మధు, ముగ్గురు అంగన్‌వాడీ టీచర్లు మరియు మదర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అకాషా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 10 రోజుల శిక్షణా సమ్మర్ క్యాంప్ ముగింపు

- **విద్యార్థులకు బహుమతుల ప్రదానం**



**కరీంనగర్ టౌన్ మే 21(పీసీడబ్ల్యూ న్యూస్):** అకాషా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 10 రోజుల శిక్షణా సమ్మర్ క్యాంప్ ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా నవాబ్ ఇంటర్నేషనల్ స్కూల్ కాశ్మీర్‌గడ్డ, కరీంనగర్‌లో ముగింపు సభ నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ఫర్జ్ నమాజ్, ఈద్ నమాజ్ మరియు జనాజా నమాజ్‌లను ప్రాయోగికంగా ప్రదర్శించారు. క్యాంప్‌లో పిల్లలకు వుజూ, నమాజ్ మరియు ఇతర దినీ అంశాలపై ప్రత్యక్ష శిక్షణ అందించబడింది. ఈ సందర్భంగా జనాబ్ అఫ్జల్ మొహియుద్దీన్, జనాబ్ ఖ్వాజా ఫసీహుద్దీన్ (నవాబ్ స్కూల్ కరస్పాండెంట్), డాక్టర్ మహ్మద్ షుఐబ్ ఒద్దీన్ (అకాషా సొసైటీ అధ్యక్షులు) మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక విద్యతో పాటు మతపరమైన విద్యపై కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. అధ్యక్షులు ముఫ్తీ మహ్మద్ యూనుస్ అల్ ఖాసిమీ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా శిబిరాలు సమాజానికి ఎంతో అవసరమని, నగరంలోని వివిధ ప్రాంతాల్లో కూడా నిర్వహించాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మక్తబ్‌లకు పంపించి సరైన మతపరమైన విద్య అందేలా చూడాలని పిలుపునిచ్చారు.తర్వాత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనాబ్ సర్వర్ షా బియాబానీ, ముతహర్ ఒద్దీన్, హాఫిజ్ అబ్దుల్ మజీద్, ఇష్తియాక్, ఇజ్హార్ హుస్సేన్ తదితర అకాషా సభ్యులు పాల్గొన్నారు. సభను ఖారీ మహ్మద్ మజ్హార్ అలీ నిర్వహించారు.

# గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

**మల్లంపల్లి మండల ప్రతినిధి మే 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి ములుగు జిల్లాలో గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలంగాణ గౌడ సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ వినిపించారు. ముఖ్యంగా ములుగు జిల్లాలో 1/70 యాక్ట్ అమలుతో గీత వృత్తిదారులకు సొసైటీలు లేకపోవడం వల్ల గీత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లారు. సొసైటీలు లేకపోవడంతో గీత కార్మికులకు ప్రభుత్వ పరమైన లబ్ధులు, ఉపాధి అవకాశాలు, వృత్తి పరిరక్షణ వంటి అంశాలు అందడం లేదని తెలిపారు.గౌడ కులస్తుల జీవనోపాధికి ఆధారమైన గీత వృత్తిని పరిరక్షించేందుకు నిలిచిపోయిన గీత కార్మికుల సొసైటీలు వెంటనే పునరుద్ధరించాలని, గీత కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఈ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి గౌడ కులస్తులకు ప్రత్యేక న్యాయం చేయాలని మంత్రి గారిని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సమస్యలను సానుకూలంగా స్వీకరించి, ఈ విషయాన్ని ముఖ్యమం త్రి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం



తరఫున తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ గౌడ్, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ట్యాగ్ లైన్:"గీత కార్మికుల హక్కుల కోసం గౌడ సంఘం గళం ప్రభుత్వానికి సమస్యల వినతి"

# అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం

**జూన్ 2 నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ప్రారంభం**

**అటవీ - రెవెన్యూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి చర్యలు**

**ధరణి సమస్యల పరిష్కారానికి భూ భారతి ద్వారా రీ సర్వే**

**సత్తుపల్లిలో రెవెన్యూ, గృహ నిర్మాణం, అటవీ భూముల సమస్యల అంశాలపై నిర్వహించిన సదస్సులో పాల్గొన్న మంత్రి పొంగులేటి**













**సత్తుపల్లి, మే 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రతి అర్హులైన పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం సత్తుపల్లిలోని ఎంఆర్ గార్డెన్స్‌లో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలా లకు సంబంధించి రెవెన్యూ, గృహ నిర్మాణం, అటవీ భూముల సమస్యల అంశాలపై నిర్వహించిన రెవెన్యూ సదస్సు కార్యక్రమం లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అండగా నిలిచే ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలు ఎన్నుకున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గురుకులాల్లో డైట్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీల పెంపు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా, సంక్షేమాన్ని ఆపకుండా రైతును రాజుగా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరంలోనే 72 వేల ఉద్యోగాలు కల్పించామని, త్వరలో కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని పేర్కొన్నారు. 22 వేల 500 కోట్ల రూపాయలతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, ఇప్పటివరకు 1.25 లక్షల ఇండ్లు పూర్తయ్యాయని, జూన్ నాటికి మరో లక్ష ఇండ్లు పూర్తవుతాయని తెలిపారు. జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఇల్లు నిర్మించుకుంటున్న పేదల ఖాతాల్లో నేరుగా ఐదు లక్షల రూపాయల సహాయం జమ చేస్తున్నామని, ప్రతి సోమవారం నిర్మాణ పురోగతి ఆధారంగా నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. పాలేరు ప్రజాదర్బార్‌లో వచ్చిన 22 వేల దరఖాస్తుల్లో 9,500 దరఖాస్తులు గృహాలకు సంబంధించినవేనని చెప్పారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. అటవీ-రెవెన్యూ సరిహద్దు వివాదాలు, రెవెన్యూ శాఖలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధరణి కారణంగా ఏర్పడిన భూములకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. బేతుపల్లి, నారాయణపురం పరిసర గ్రామాల్లోని భూములను అధికారులు సర్వే చేసి, పొజిషన్‌లో ఉన్న అర్హులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలని ఆదేశించారు. రుద్రాక్షపల్లి, బుగ్గపాడు, వెంకటగిరి, తదితర గ్రామాల్లో ఉన్న అటవీ-రెవెన్యూ సరిహద్దు వివాదాలను వర్షాకాలం లోపు జాయింట్ సర్వే ద్వారా పరిష్కరించాలని సూచించారు. ఇసుక, మట్టి వంటి చిన్న చిన్న కారణాలతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఇబ్బంది లకు గురిచేయవద్దని అధికారులను ఆదేశించారు. ముల్కపల్లిలో కొత్త ఇసుక రీచ్ మంజూరు చేశామని, అక్కడి నుంచి నాణ్యమైన ఇసుక సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ అధికారులు ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, న్యాయబద్ధమైన ప్రతి సమస్య పరిష్కారం తన బాధ్యత అని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సత్తుపల్లి పరిధిలోని రెవెన్యూ, గృహ నిర్మాణం, అటవీ భూముల సమస్యలపై సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాలేరు నియోజకవర్గ ప్రజా దర్బార్ కార్యక్రమంలో 22 వేల దరఖాస్తులు అందాయని, వాటిలో 14 వేల దరఖాస్తుల విచారణ పూర్తయిందన్నారు. ప్రతి దరఖాస్తును అర్హత ఆధారంగా పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. భూములకు సంబంధించిన అనేక సమస్యలు రీ సర్వే ద్వారా పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. తిరుమలాయపాలెం మండలంలో రీ సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాలకు కనీస స్థాయిలో కూడా ఇండ్లు మంజూరు కాలేదన్నారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు కూడా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌళిక వసతులకు ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే కల్పించామని తెలిపారు. మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, వాటిలో 1,500 ఇండ్ల గృహప్రవేశాలు నిర్వహించామని, రాష్ట్రం లోనే ఇందిరమ్మ పథకం అమలులో సత్తుపల్లి నియోజకవర్గం ముందంజలో ఉందన్నారు. జూన్ 2 నుంచి ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత ప్రారంభమవుతుందని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఉన్న 18 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇండ్ల స్థలాలుగా మార్చి భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేసేలా ప్రభుత్వం అనుమతించా లని మంత్రిని కోరారు. అటవీ శాఖ అధికారులు చిన్న, చిన్న అంశాలకు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ విధానం మారాలని అన్నారు. చంద్రాయపాలెం, బుగ్గపాడు, రామచంద్రపురం, ఏరుగట్ల గ్రామాలలో అటవీ-రెవెన్యూ శాఖలు సంయుక్త సర్వే నిర్వహించి రైతులకు పట్టాలు అందించాలని, నారాయణపురం గ్రామంలోని ఆర్ఎస్ఆర్ సమస్యను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వాల వల్ల ఏర్పడిన భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం "భూ భారతి" పోర్టల్‌ను ప్రవేశపెట్టిందన్నారు. లైసెన్స్ సర్వేయర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి లైసెన్సులు మంజూరు చేసినట్లు చెప్పారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని, సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో ఉన్న రెవెన్యూ, అటవీ భూ వివాదాల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గతంలో పట్టా ఉండి ప్రస్తుతం పట్టాలు లేని రైతులకు వెంటనే పట్టాదారు పాస్ పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసిపి వసుంధర యాదవ్, సత్తుపల్లి ఎఫ్.డి.ఓ. స్నేహలత, సత్తుపల్లి మునిసిపల్ చైర్ పర్సన్ రెహానా బేగం, ఏఎంసి లు నీరజా ప్రభాకర్, ఆనంద్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్ల, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు మెంబర్లు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి నేత, కంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ జన్మదిన వేడుకలు..






**కరీంనగర్ టౌన్ మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ , ఏడవ డివిజన్ బిజెపి నేత, కంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తోట సాగర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బిజెపి కార్యకర్తలు అన్న ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తోట సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## సుడా అభివృద్ధి పనులపై వర్చువల్ సమావేశం






**కరీంనగర్ టౌన్ మే 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** సుడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అంగారిక టౌన్ షిప్, ఎల్ఆర్ఎస్, నిర్మాణ దశలో ఉన్న సుడా కమర్షియల్ బిల్డింగ్, ఐడిఎస్ఎంటి, ఫుడ్ కోర్ట్ తదితర అంశాలపై ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన పనులు, నిధుల కేటాయింపు, నిధుల సేకరణ, కొత్త లే అవుట్ల అభివృద్ధి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్ర పాల్గొని పలు కీలక అంశాలపై సూచనలు చేశారు. సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సీపీవో ఆంజనేయులు, ఎస్ఈ రాజ్ కుమార్, డీఈ రాజేంద్ర ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో ఘన నివాళులు

- **రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకే కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుంది : కవ్వంపల్లి సత్యనారాయణ**





**హైదరాబాద్ మే 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దళిత విభాగ నాయకులు పెద్ద ఎత్తున హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఆర్ మోహన్, అధికార ప్రతినిధి, టీపీసీసీ ఎస్సీఎల్ కోఆర్డినేటర్ ఆరెపల్లి రాజేందర్, గడ్డం శ్రీనివాస్ తదితర దళిత విభాగ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ ఆధునిక భారత నిర్మాణ శిల్పి అని పేర్కొన్నారు. దేశాన్ని ఇరవై ఒకటో శతాబ్దం వైపు తీసుకెళ్లిన దూరదృష్టి గల నాయకుడిగా ఆయన సేవలను కొనియాడారు. దేశంలో సమాచార సాంకేతిక రంగ అభివృద్ధికి పునాది వేసింది రాజీవ్ గాంధీనేనని తెలిపారు. కంప్యూటర్ వ్యవస్థను దేశానికి పరిచయం చేసి యువతకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకువచ్చిన మహానేత అని అన్నారు. 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి యువతకు రాజకీయ హక్కులను అందించిన ఘనత రాజీవ్ గాంధీదేనని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధే దేశాభివృద్ధి అన్న నమ్మకంతో పంచాయతీరాజ్ వ్యవస్థకు బలమైన పునాదులు వేసి గ్రామ స్వరాజ్య సాధనకు కృషి చేశారని తెలిపారు. దేశ సమగ్ర అభివృద్ధి, సాంకేతిక విప్లవం, గ్రామీణ స్వయంపాలన, యువత సాధికారత కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకే కట్టుబడి ఉంటుందని తెలిపారు.

# 18 సంవత్సరాలకే యువతకు ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుంది: కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సుడా చైర్మన్

### భారతదేశ దేశాలతో పోటీ పడుతుందంటే అది ఈరోజు స్వర్గీయ రాజీవ్ గాంధీ తీసుకువచ్చిన సాంకేతిక విప్లవం వల్లే. వైద్యుల అంజన్ కుమార్. కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు











**కరీంనగర్ జిల్లా మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంతో పాటు నగరంలో పలుచోట్ల వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగినాయి. మొదట కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ చిత్రపటానికి వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుంది, సాంకేతిక విప్లవాన్ని తీసుకువచ్చి భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలపడానికి వారు చేసిన కృషి మరువలేనిది. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వారి అడుగుజాడల్లో నడిచి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు.వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలతో భారతదేశం పోటీ పడుతుందంటే అది ఈరోజు స్వర్గీయ రాజీవ్ గాంధీ తీసుకువచ్చిన టెక్నాలజీ వల్లే అని, యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి రాజకీయాల్లో యువత ప్రోత్సహించినారని ఈరోజు మనం కంప్యూటర్, సెల్ ఫోన్ మరియు ఇప్పుడు వచ్చిన ఏఐ లాంటి టెక్నాలజీని వాడుతున్నామంటే అది రాజీవ్ గాంధీ వల్లే, ప్రపంచ దేశాల్లో భారతదేశం అగ్రగామిగా ఉంది అంటే ఆరోజు ఆయన తీసుకువచ్చిన విప్లవాత్మక నిర్ణయాలే, రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం నేటి యువత పాటుపడాలని అన్నారు.అనంతరం నగరంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇమ్రాన్ గని, ఆసిఫ్, హరీష్ ఆధ్వర్యంలో కార్ఖానా గడ్డ వృద్ధులు, వికలాంగుల ఆశ్రమంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో రైతులకు, కార్మికులకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది.నేత బజార్ మార్కెట్ వద్ద కార్పొరేటర్ కళ్లేపెల్లి శారద బాలరాజు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించడంతోపాటు పండ్లు పంపిణీ చేశారు.అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ మార్క రాజా గౌడ్ ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు.అర్బన్ డిసిసి ప్రధాన కార్యదర్శి కపిల్ మాధవ్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డు వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ, మరియు అన్నదానం చేయడం జరిగింది.బదరున్నిసా - యం.డి.పాషా ఆధ్వర్యంలో బొమ్మకల్ ఫ్లైఓవర్ (అబుల్ కలాం) విగ్రహం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాలలో నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, మడుపు మోహన్, గంటకల్యాణి శ్రీనివాస్, కాంతాల జగన్ రెడ్డి, వరాల నరసింగం, చాడగొండ బుచ్చిరెడ్డి,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,మాచర్ల ప్రసాద్, వంగల విద్యాసాగర్, ముస్తాక్, అహ్మద్ అలీ, విక్టర్, కోడూరు రవీందర్, కంకణాల అనిల్ కుమార్, నిమ్మల అంజయ్య గౌడ్, కుంభాల రాజు కుమార్, మూల జైపాల్, ఇమ్రాన్, పహాద్, పోరండ్లరమేష్, మాదాసు శ్రీనివాస్, గడప శ్రీనివాస్, శిల్ప, సరీళ్ల రతన్ రాజు, షబానా మహమ్మద్, ముక్కా భాస్కర్, సిరిపురం మనోజ్, జిడి రమేష్, దండి రవీందర్,సుంకర్ గణపతి, అబ్దుల్ బారి,అందే శంక,ర్ పెంట శేఖర్,వసీం, స్వప్న శ్రీ,శ్రీరాముల రమేష్, ఇమ్రాన్,అజ్మత్, సుదర్శన్ పాల్గొన్నారు.


---

# కమ్మేసిన కాలుష్యం.. ఊపిరాడక ఇబ్బంది పడుతున్న జనం











- **స్టోన్ క్రషర్ బ్లాస్టింగ్‌తో గ్రామాలపై దుమ్ము మబ్బులు**
- **జాతీయ రహదారిపై గ్రామస్తుల ధర్నా.. భారీ ట్రాఫిక్ జామ్**

**ములుగు, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కటాక్షపూర్ గ్రామ పరిధిలో ఉన్న సుమతి స్టోన్ క్రషర్‌లో నిర్వహించిన బోర్ బ్లాస్టింగ్ కారణంగా మహమ్మద్ గౌస్‌పల్లి, కటాక్ష పూర్ గ్రామాలు తీవ్ర కాలుష్యానికి గురయ్యాయి. క్రషర్‌లో జరిగిన బ్లాస్టింగ్‌తో పెద్ద ఎత్తున దుమ్ము, పొగ గ్రామాలపై వ్యాపించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.గ్రామ శివారులోని గుట్ట ప్రాంతంలో ఉన్న క్రషర్‌లో బ్లాస్టింగ్ జరగడంతో దట్టమైన దుమ్ము గ్రామమంతా కమ్మేసిందని స్థానికులు తెలిపారు. దుర్వాసనతో కూడిన పొగ కారణంగా శ్వాస తీసుకోవడమే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆస్తమా బాధితులు, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.నిత్యం ఇదే పరిస్థితి ఎదురవుతోందని ఆరోపించిన గ్రామ ప్రజలు సమూహంగా క్రషర్ కార్యాలయానికి వెళ్లి యాజమాన్యాన్ని ప్రశ్నించేందుకు ప్రయత్నించారు. అయితే అక్కడ ఉన్న సిబ్బంది “ఏం చేసుకుంటారో చేసుకోండి” అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారని గ్రామస్తులు ఆరోపించారు.దీంతో ఆగ్రహానికి గురైన గ్రామ ప్రజలు నేషనల్ హైవే-163పై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. సుమారు గంటకు పైగా కొనసాగిన ఈ నిరసనతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఆత్మకూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామ ప్రజలు ధర్నాను విరమించారు.ఈ నిరసన కార్యక్రమంలో రెండు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానికులు కాలుష్య నియంత్రణ చర్యలు వెంటనే చేపట్టి, స్టోన్ క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.

---

# యురేనియం ఉద్యోగిపై రాడ్ల దాడి..!

- **మబ్బుచింతలపల్లి సమీపంలో అడ్డగించిన దుండగులు**
- **తీవ్రంగా గాయపడిన యూనియన్ నాయకుడు సుగుణాధ రెడ్డి**
- **కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు**



**వేముల మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** వేముల మండల పరిధిలోని స్థానిక మబ్బుచింతలపల్లి సమీపంలో యూసీఐఎల్ (యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియన్ లిమిటెడ్) ఉద్యోగి,యూనియన్ నాయకుడు సుగుణాధ రెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడం తీవ్ర కలకలం రేపింది. గురువారం ఉదయం జరిగిన ఈ ఘటనలో దుండగులు ప్రణాళికాబద్ధంగా అడ్డగించి ఇనుపరాడ్లతో విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు.స్థానికుల కథనం మేరకు, పులివెందుల నుంచి యురేనియం ప్రాజెక్టుకు ఉద్యోగ నిమిత్తం వెళ్తున్న సుగుణాధ రెడ్డిని మబ్బుచింతలపల్లికొట్టాల వేల్పుల క్రాస్ దాటిన అనంతరం ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు అడ్డగించారు. అనంతరం ఇనుపరాడ్లతో దాడి చేయడంతో ప్రాణభయంతో తప్పించుకునేందుకు ప్రయత్నించిన సుగుణాధ రెడ్డి అదుపుతప్పి రోడ్డుపక్కనున్న గోడను ఢీకొట్టి కిందపడ్డారు.కిందపడిన తరువాత కూడా దుండగులు వెనక్కి తగ్గకుండా మళ్లీ దాడి చేసినట్లు సమాచారం. ఇదే మార్గంలో వెళ్తున్న ఇతర ఉద్యోగులు ఘటనను గమనించి వెంటనే స్పందించడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. గాయాలపాలైన సుగుణాధ రెడ్డిని హుటాహుటిన పులివెందులలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి మార్చి వైద్యం అందిస్తున్నారు.ఈ దాడి వెనుక ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత విభేదాలు లేదా యూనియన్ వ్యవహారాల కోణం ఉందా అనే దిశగా పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. బాధితుడు సుగుణాధ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

---

# కుల గణనపై సుప్రీంకోర్టు వైఖరి కీలకం

### - జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్



**హైదరాబాద్, మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కుల గణన ప్రక్రియకు అడ్డంకిగా మారిన ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు తిరస్కరించడం దేశ రాజకీయ - సామాజిక చరిత్రలో అత్యంత కీలక పరిణామమని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం కాచిగూడ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు, వెనుకబడిన వర్గాలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అంశానికి న్యాయవ్యవస్థ నుంచి సానుకూల సంకేతాలు రావడం సామాజిక న్యాయ పోరాటానికి గొప్ప బలమన్నారు. కొన్ని రోజులుగా కుల గణన పై దేశవ్యాప్తంగా చర్చలు వేడెక్కిన నేపథ్య ంలో, కొందరు వర్గాలు దీన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నాయని గుజ్జ సత్యం విమర్శిం చారు. వాస్తవాలు బయటకు వస్తేనే సమాన అవకాశాలు, వనరుల సమన్యాయం, రాజకీయ భాగస్వామ్యం సాధ్యమవు తాయని పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులను వెలికితీసే దిశగా సుప్రీంకోర్టు తాజా వైఖరి దేశాన్ని మరింత సమానత్వం వైపు నడిపించే అడుగుగా నిలుస్తుందని రాజేందర్ పటేల్ గౌడ్ అభిప్రాయపడ్డారు.

---

# ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి

- **ప్రొద్దుటూరులో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో ఎస్.ఐ.ఆర్ అవగాహన కార్యక్రమం**



**ప్రొద్దుటూరు మే 21(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై బూత్ ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జోన్-5 ఆర్గనైజేషన్ సెక్రటరీ చల్లా మధుసూదన్ రెడ్డి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వజ్ర భాస్కర్ రెడ్డి, ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిశీలకులు పూల శ్రీనివాసులరెడ్డి, ఐటీ కోఆర్డినేటర్ అనిల్ పాల్గొన్నారు. వారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, కొత్త ఓట్ల నమోదు, తొలగింపులు, మార్పులు-చేర్పులపై బూత్ ఏజెంట్లకు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి ఎల్ ఓ లు తమ పరిధిలోని ఓటర్ల వివరాలను నిశితంగా పరిశీలించి జాగ్రత్తగా మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గం పార్టీ కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటుందని, రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నాయకత్వం మరియు టీం వర్క్‌కు పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి బూత్ ఏజెంట్ అకుంఠిత దీక్షతో, దృఢ సంకల్పంతో పనిచేసి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బూత్ ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాన్వీతో కలిసి సరదాగా ప్యాట్ కమిన్స్

క్రికెట్, సినిమా.. ఈ రెండు రంగాలకు ఇండియాలో ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తాజాగా ఈ రెండు రంగాలకు చెందిన ఇద్దరు స్టార్స్ ఒకే వేదికపై సందడి చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హైదరాబాద్‌లో జరిగిన ఓ ఫ్యాన్ ఈవెంట్‌లో కలుసుకున్నారు. ఎప్పుడూ మైదానంలో తన ఫాస్ట్ బౌలింగ్‌తో బ్యాటర్లను భయపెట్టే కమిన్స్.. ఇక్కడ మాత్రం తన సీరియస్‌నెస్‌ను పక్కనపెట్టి జాన్వీతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతూ ఫ్యాన్స్‌ను ఫుల్ ఎంటర్‌టైన్ చేశాడు. హైదరాబాద్‌లో ఈవెంట్‌లో ఓ ఆసక్తికర ఘట్టం చోటు చేసుకుంది. ఫ్యాన్స్‌తో ఇంటరాక్ట్ అయ్యేందుకు స్టేజ్‌పై ఏర్పాటు చేసిన చిన్న క్రికెట్ సెటప్‌లో 'పెద్ది' మూవీ స్టార్ జాన్వీ కపూర్ బ్యాట్ పట్టుకోగా, కమిన్స్ బౌలింగ్ చేశాడు. ఆస్ట్రేలియా స్పీడ్‌స్టర్ సరదాగా వేసిన బంతిని జాన్వీ కాస్త ముందుకు వచ్చి బలంగా షాట్ ఆడింది. అయితే ఎవరూ ఊహించని విధంగా ఆ బంతి నేరుగా వెళ్లి అక్కడే ఉన్న ప్రేక్షకుల్లోకి దూసుకెళ్లింది. సరిగ్గా అదే సమయంలో స్టేజ్ కింద ఓ అభిమాని తన మొబైల్‌లో ఈ ఫన్నీ దృశ్యాలను రికార్డ్ చేస్తున్నాడు. జాన్వీ కొట్టిన బంతి నేరుగా వెళ్లి ఆ ఫ్యాన్ ఫోన్‌కి తగలడంతో ఒక్కసారిగా అంతా షాక్ అయ్యారు. ఈ అనుకోని సంఘటనతో స్టేజ్ మీద ఉన్న జాన్వీ కూడా



కంగుతింది. ఆ తర్వాత క్షణాల్లోనే అక్కడి వాతావరణం అంతా నవ్వులు, కేకలతో నిండిపోయింది. ఈ యాక్సిడెంటల్ షాట్, ఆ వెంటనే జాన్వీ ఇచ్చిన రియాక్షన్‌కు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారాయి. ఈ క్యూట్ అండ్ షాకింగ్ ఇన్సిడెంట్ తర్వాత జాన్వీ కపూర్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించింది. బంతి తగిలిన అభిమానికి క్షమాపణలు చెబుతూ ఓ పోస్ట్ పెట్టింది. "నేను కొట్టిన బంతి ఎవరి కంటికైతే తగిలిందో వాళ్ళకి సారీ.. క్రికెట్ ఆడేటప్పుడు నా బ్యాలెన్స్ ఇంకా పూర్తిగా సెట్ కాలేదు, కానీ ఎప్పటికీ నేను చఅవష్మఝ్రీ-ఖఅవివ బేబీనే" అంటూ సరదాగా రాసుకొచ్చింది. ఈ పోస్ట్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' సినిమా కోసం సుమారు 150 రోజుల పాటు కఠినమైన క్రికెట్ శిక్షణ తీసుకుంది జాన్వీ కపూర్. అందుకే ఈమెకు క్రికెట్‌లో మంచి టాలెంట్ ఉ:ది. కోచ్ అభిషేక్ నాయర్ పర్యవేక్షణలో ప్రొఫెషనల్ క్రికెటర్‌లా బ్యాటింగ్, బౌలింగ్ నైపుణ్యాలు నేర్చుకుంది ఈ బ్యూటీ. ఈ ప్రాక్టీస్ సమయంలో జాన్వీకీ చాలా దెబ్బలు కూడా తగిలాయి. ఆ ప్రాక్టీస్ ఇప్పుడిలా పనికొచ్చింది. కమిన్స్, జాన్వీ కలిసిన ఈ అరుదైన క్రికెట్-సినిమా క్రాస్‌ఓవర్ మూమెంట్ ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. సినిమా వాళ్లను చూడటానికి వచ్చిన అభిమానులకు స్టార్ క్రికెటర్ కూడా తోడవడంతో ఈవెంట్‌కు విపరీతమైన క్రేజ్ వచ్చింది. జాన్వీ ఆడిన పవర్‌ఫుల్ షాట్‌పై, పాపం వీడియో తీసుకుంటూ బంతి బారిన పడ్డ ఆ అభిమానిపై నెటిజన్లు రకరకాల మీమ్స్, జోక్స్ క్రియేట్ చేస్తున్నారు. ఏదేమైనా.. రీసెంట్ టైమ్స్‌లో జరిగిన అత్యంత ఫన్నీ అండ్ ఎంటర్‌టైనింగ్ సెలబ్రిటీ ఈవెంట్‌గా ఇది నిలిచిపోయింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. పెద్ది సినిమాలో కూడా క్రికెట్ నేపథ్యం ఉంది. మే 22న ఉప్పల్ స్టేడియంలో జరగబోయే మ్యాచ్‌లో పెద్ది సినిమా ప్రమోషనల్ యాక్టివిటీ కూడా ఉంది.

# సారా టెండూల్కర్‌కు అవమానం



సెలబ్రిటీలను కొందరు ప్రశాంతంగా ఉంచడం లేదు. నిత్యం ఏదో ఒక వివాదం సృష్టిస్తున్నారు. తాజాగా క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆమెను బాడీ షేమింగ్ చేస్తూ ఫొటోలు, వీడియోలు పోస్టు చేయడం తీవ్ర దుమారం రేపింది. అంతేకాకుండా ఆమె వదినపై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో అతడిపై సారాతోపాటు నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. ఈ వ్యవహారంపై సారా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసహ్యంగా మాట్లాడుతున్నారని మండిపడుతూ వెంటనే డిలీట్ చేయాలని కోరారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ ముంబైలో నివసిస్తున్నారు. సచిన్ కుమార్తె కావడంతోపాటు ఆమె నిత్యం సోషల్ మీడియాలో తన ఫొటోలు, తనకు సంబంధించిన విశేషాలు పంచుకుంటుండడంతో ఆమెకు అభిమానులు పెరుగుతున్నారు. ఆమె సెలబ్రిటీ స్థాయి గుర్తింపు పొందడంతో ఎక్కడకు వెళ్లినా సారా టెండూల్కర్‌ను చుట్టుముడుతున్నారు. ఈ క్రమంలో ముంబై ఎయిర్‌పోర్టుకు తన వదినతో కలిసి సారా టెండూల్కర్ వెళ్లిన సమయంలో అక్కడ ఉన్న కొందరు జర్నలిస్టులు ఫొటోలు, వీడియోలు తీశారు. అవి తీసిన వ్యక్తి సోషల్ మీడియాలో పంచుకుంటూ సారా టెండూల్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆమెపై బాడీ షేమింగ్‌కు పాల్పడ్డారు. 'మీరు చాలా అసహ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇది జర్నలిజం కాదు. మమ్మల్ని ప్రశాంతంగా వదిలేయాలి' అని సారా టెండూల్కర్ విజ్ఞప్తి చేశారు. సారా టెండూల్కర్ స్పందించడంతో వెంటనే ఆ వ్యక్తి వీడియోను సోషల్ మీడియా నుంచి తొలగించారు. పోస్టును తొలగించిన వ్యక్తిని సారా టెండూల్కర్ అంతటితో వదిలేయకుండా.. 'మీ పోస్ట్‌ను డిలీట్ చేసి ఉండొచ్చు. కానీ మీలోని అసహ్యకరమైన ఆలోచనా విధానాన్ని ఏమాత్రం మారదు' అని బుద్ధి చెప్పారు. సచిన్ కుమారుడు అర్జున్ టెండూల్కర్‌కు మార్చి 5వ తేదీన సానియా చంధోక్‌తో వివాహమైన విషయం తెలిసిందే. ఎయిర్‌పోర్టులో వదన సానియాతో కలిసి వెళ్తుండగా సదరు జర్నలిస్టు (పాపరాజీ) వీడియో తీసి పోస్టు చేయడం దుమారం రేపింది. ఇది ఇంతటితో ఆగే అంశం కాదని.. ఆ జర్నలిస్టుపై సారా టెండూల్కర్ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. అతడి నుంచి క్షమాపణ అడగడమే కాకుండా అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తారని సమాచారం. ఇది ఇలా ఉంటే 28 ఏళ్ల సారా టెండూల్కర్ ఇంకా వివాహం చేసుకోలేదు. ప్రస్తుతానికి తండ్రి స్థాపించిన ఫౌండేషన్‌తోపాటు పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఓ కొత్త వ్యాపారం ప్రారంభించిన విషయం తెలిసిందే.

# హార్దిక్ పాండ్యాకు షాక్ ఇచ్చిన బీసీసీఐ..



ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు గట్టి షాక్ తగిలింది. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 4 వికెట్ల తేడాతో ఓటమి చవిచూడటమే కాకుండా, కెప్టెన్ కూడా జరిమానా బారిన పడటంతో ముంబై జట్టుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. బుధవారం రాత్రి కోల్‌కతాలోని ప్రసిద్ధ ఈడెన్ గార్డెన్స్ మైదానంలో కోల్‌కతా నైట్ రైడర్స్ , ముంబై ఇండియన్స్ జట్ల మధ్య ఉత్కంఠభరిత పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా మైదానంలో ప్రవర్తించిన తీరుపై బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆటగాళ్లు, సిబ్బంది కోసం రూపొందించిన ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని పాండ్యా ఉల్లంఘించినట్లు మ్యాచ్ రెఫరీ నిర్ధారించారు. వెన్నునొప్పి కారణంగా గత మూడు మ్యాచ్‌లకు దూరమైన హార్దిక్ పాండ్యా, ఈ మ్యాచ్‌తోనే మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టాడు. అయితే, పునరాగమనం చేసిన మొదటి మ్యాచ్‌లోనే ఆయన వివాదంలో చిక్కుకున్నాడు. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లోని ఆర్టికల్ 2.2 ప్రకారం.. "మ్యాచ్ జరుగుతున్న సమయంలో క్రికెట్ కిట్ లేదా దుస్తులు, మైదానంలోని పరికరాలు (వికెట్లు, బెయిల్స్ మొదలైనవి) లేదా స్టేడియంకు సంబంధించిన వస్తువులను దుర్వినియోగం చేయడం లేదా వాటిపై కోపం ప్రదర్శించడం" తీవ్రమైన నేరం. హార్దిక్ పాండ్యా ఈ నిబంధననే ఉల్లంఘించినట్లు తేలింది. కోల్‌కతా నైట్ రైడర్స్ ఇన్నింగ్స్ జరుగుతున్న సమయంలో, 10వ ఓవర్ నాల్గవ బంతి వేసిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో బౌలింగ్ చేస్తున్న హార్దిక్ పాండ్యా, బంతి వేసి తిరిగి తన రన్-అప్ మార్క్ వైపు వెళ్తున్న క్రమంలో తీవ్ర అసహనానికి గురయ్యాడు. కోపంతో గట్టిగా వికెట్లపై ఉన్న బెయిల్స్‌ను చేత్తో కిందకు పడేసాడు. ఆయన ప్రదర్శించిన ఈ దూకుడు ప్రవర్తన అటు అంపైర్లతో పాటు మ్యాచ్ అధికారుల దృష్టికి వెళ్లింది. మైదానంలో హార్దిక్ పాండ్యా అంతలా అసహనానికి లోనవడానికి ముంబై ఫీల్డర్ల నిర్లక్ష్యమే కారణమని స్పష్టమవుతోంది. ఆ ఓవర్‌కు ముందే.. పాండ్యా వేసిన బంతికి కేకేఆర్ బ్యాటర్ రోవ్‌మన్ పావెల్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను ముంబై ఫీల్డర్లు దీపక్ చాహర్, రాబిన్ మింజ్ వదిలేశారు. పావెల్ ఇచ్చిన టాప్-ఎడ్జ్ క్యాచ్‌ను అందుకోవడానికి వీరిద్దరిలో ఎవరూ చొరవ చూపకపోవడంతో, బంతి వారిద్దరి మధ్యలో బౌండరీ లైన్ దగ్గర పడింది. అప్పటికి పావెల్ కేవలం 14 పరుగుల (8 బంతుల్లో) వద్ద మాత్రమే ఉన్నాడు. ఈ సులువైన క్యాచ్ మిస్ అవ్వడం పాండ్యాకు తీవ్ర నిరాశను మిగిల్చింది. ఈ క్యాచ్ డ్రాప్ అయిన వెంటనే, మనీష్ పాండే వరుసగా రెండు ఫోర్లు కొట్టి హార్దిక్ పాండ్యా బౌలింగ్‌ను చీల్చిచెండాడాడు. అటు క్యాచ్ మిస్ అవ్వడం, ఇటు వరుసగా ఫోర్లు పడటంతో పాండ్యా తన నిరాశను, కోపాన్ని అణచుకోలేక వికెట్లపై చూపించాడు.



# మహమ్మద్ షమీకి కోర్టులో భారీ ఊరట

ఐపీఎల్ 2026లో బిజీగా ఉన్న టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీకి కోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన భార్య హసీన్ జహాన్ దాఖలు చేసిన ఓ వివాదాస్పదన కేసులో న్యాయస్థానం షమీని నిర్దోషిగా ప్రకటిస్తూ సంచలన తీర్పునిచ్చింది. భార్య హసీన్ జహాన్ గతంలో మహమ్మద్ షమీపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేసింది. షమీ తనకు ఇచ్చిన లక్ష రూపాయల విలువైన చెక్ బ్యాంకులో బౌన్స్ అయిందంటూ ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ కేసు గత నాలుగేళ్ళుగా కోల్‌కతాలోని అలీపూర్ కోర్టులో విచారణలో ఉంది. ఇరుపక్షాల వాదనలను విన్న అలీపూర్ కోర్టు.. తుది తీర్పును వెల్లడిస్తూ మహమ్మద్ షమీపై ఉన్న చెక్ బౌన్స్ ఆరోపణలను కొట్టివేసింది. ఆయనను ఈ కేసు నుంచి పూర్తిగా విముక్తుడిని చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ అజయ్ కుమార్ ముఖర్జీ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ వివాదం పూర్తిగా పరిష్కారం అయ్యేంతవరకు హసీన్ జహాన్ ఖర్చుల నిమిత్తం నెలకు రూ.1.5 లక్షలు, అలాగే వారి కుమార్తెకు రూ.2.5 లక్షల చొప్పున చెల్లించాలని న్యాయస్థానం పేర్కొంది. ఒకవేళ మహమ్మద్ షమీ తన కూతురు అదనపు అవసరాల కోసం తన స్వచ్ఛంద నిర్ణయంతో ఇంకా ఎక్కువ మొత్తాన్ని ఇవ్వాలనుకుంటే.. దానికి ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. కాగా గతేడాది జస్టిస్ అజయ్ కుమార్ ముఖర్జీ భార్య, కుమార్తె భృతి కోసం షమీ నెలకు రూ.4 లక్షలు ఇవ్వాలని ఆదేశించిన సంగతి తెలిసిందే.

# ఐపీఎల్ రికార్డులను బద్దలు కొట్టిన వైభవ్ సూర్యవంశీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన రికార్డుల పరంపరను కొనసాగిస్తున్నాడు. జైపూర్‌లో లక్నో సూపర్ జెయింట్స్ విధించిన 221 పరుగుల భారీ టార్గెట్‌ను ఛేదించే క్రమంలో సూర్యవంశీ కేవలం 38 బంతుల్లోనే 93 పరుగులతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలోనే ఒక ఐపీఎల్ సీజన్ లో 500 పరుగుల మార్కును అందుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఇంతకుముందు 2018 లో ఢిల్లీ డెర్‌డెవిల్స్ తరపున 20 ఏళ్ల వయసులో ఈ ఘనత సాధించిన రిషభ్ పంత్ రికార్డును ఈ యువ ఆటగాడు అధిగమించాడు. ప్రస్తుత ఎడిషన్‌లో కనీసం 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్లలో 236.3 అత్యధిక స్ట్రైక్ రేట్‌తో సూర్యవంశీ మొదటి స్థానంలో నిలిచాడు. ఈ ఇన్నింగ్స్ ద్వారా ఒకే ఐపీఎల్ సీజన్ లో 50 సిక్సర్లు బాదిన మొట్టమొదటి భారతీయ బ్యాటర్‌గా వైభవ్ సూర్యవంశీ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రస్తుతం ఈ 2026 సీజన్ లో ఆయన ఖాతాలో మొత్తం 53 సిక్సర్లు ఉన్నాయి. ఒకే ఇన్నింగ్స్‌లో 10 లేదా అంతకంటే ఎక్కువ సిక్సర్లు రెండుసార్లు కొట్టిన రేర్ రికార్డును కూడా ఆయన దక్కించుకున్నాడు. తాజా డేటా ప్రకారం, పవర్‌ప్లేలో అత్యధిక సిక్సర్లు (60 సిక్సర్లు) కొట్టిన జట్టుగా రాజస్థాన్ రాయల్స్ సరికొత్త ఐపీఎల్ రికార్డు నెలకొల్పింది. ఇందులో సూర్యవంశీ ఒక్కడే 37 సిక్సర్లు బాదగా, యశస్వి జైస్వాల్ 12, మిగిలిన టీమ్ సభ్యులు 11 సిక్సర్లు కాంట్రిబ్యూట్ చేశారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ జట్టుకు వైభవ్ సూర్యవంశీ (93 పరుగులు, 10 సిక్సర్లు, 7 ఫోర్లు) బ్లిస్టరింగ్ స్టార్ట్ ఇచ్చాడు. ఆయనతో పాటు ధ్రువ్ జురెల్ కూడా 38 బంతుల్లో 53 పరుగులతో రాణించడంతో రాయల్స్ జట్టు కేవలం 3 వికెట్లు కోల్పోయి సులువుగా విజయాన్ని అందుకుంది.


# ప్లేఆఫ్స్ రేసులో రాజస్థాన్ రాయల్స్

ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా సాగుతున్న సమయంలో రాజస్థాన్ రాయల్స్ ముందడుగు వేసింది. రేసులో కొనసాగాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో రాజస్థాన్ అద్భుతంగా ఆడి లక్నో సూపర్ జియాంట్స్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో ప్లేఆఫ్స్ రేసులో ఇంకా తానున్నానని రాజస్థాన్ ప్రకటించగా.. 9వ ఓటమితో లక్నో పాయింట్ల పట్టికలో తన అట్టడుగు స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. వైభవ్ సూర్యవంశీ భారీ ఇన్నింగ్స్‌తో రాజస్థాన్ మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. లక్నో విధించిన 221 లక్ష్యాన్ని 7 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్ ఛేదించింది. బాల క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరోసారి భారీ స్కోర్ నమోదు చేశాడు. అర్ధ సెంచరీ వరకు నిలకడగా ఆడి అనంతరం రెచ్చిపోయాడు. బ్యాట్‌తో బీభత్సం సృష్టించి 38 బంతుల్లో 93 పరుగులు చేశాడు. ఏడు ఫోర్లు కొట్టగా.. పది సిక్సర్లతో గ్రౌండ్‌లో ప్రేక్షకులకు పసందైన విందు అందించాడు. ఎక్కడా కూడా తగ్గకుండా ఆడుతూ జట్టు విజయానికి మార్గం వేశాడు. సెంచరీ పూర్తి చేసి ఆటను ముగిస్తాడనుకుంటే కుదరలేదు. కెప్టెన్ యశస్వి జైస్వాల్ 23 బంతుల్లో 43 పరుగులు చేసి సత్తా చాటగా.. ధ్రువ్ జురేల్ మరో అద్భుత ప్రదర్శన చేసి అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. 38 బంతుల్లో 53 పరుగులు చేసి మూడు ఫోర్లు, మూడు సిక్సర్లు బాదాడు. ప్రిటోరియస్ (7), డొనవన్ ఫెరెరా (16) విజయానికి కావాల్సిన



పరుగులు చేశారు. ప్రత్యర్థి ప్లేఆఫ్స్ కలను దెబ్బతీసేందుకు లక్నో సూపర్ జియాంట్స్ బౌలర్లు ఏమాత్రం శ్రమించలేదు. ఆకాశ్ సింగ్, మొహిసిన్ ఖాన్ ఒక్కో వికెట్ పరిమితమవగా.. మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జియాంట్స్ నిర్ణీత 20 ఓవర్లకు ఐదు వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలనే కసితో మిచెల్ మార్ష్ అద్భుతంగా ఆడి విధ్వంసం సృష్టించాడు. 57 బంతుల్లో 96 పరుగులు చేసి కొద్దిలో సెంచరీని మిస్సయ్యాడు. 11 ఫోర్లు, ఐదు సిక్సర్లతో దుమ్మురేపాడు. ఏమాత్రం బెరుకు లేకుండా పవర్‌ప్లే నుంచే దూకుడు ప్రారంభించగా.. అతడికి జోష్ ఇంగ్లిష్ జత కలిశాడు. 29 బంతుల్లో ఇంగ్లిష్ 60 పరుగులు చేసి సత్తా చాటాడు. ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో దూకుడుగా ఆడి భారీ స్కోర్‌కు బాటలు వేశారు. నికోలస్ పూరన్ (16) తక్కువ స్కోర్ చేయగా.. కెప్టెన్ రిషబ్ పంత్ 32 బంతుల్లో 35 పరుగులతో రాణించాడు. రాజస్థాన్ బౌలింగ్ మెరుగవ్వాలని బౌలర్ల ప్రదర్శన చూస్తే చెప్పవచ్చు. యశ్ పూజా రెండు వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్ ఒక వికెట్ పడగొట్టాడు.

# రఘువంశీపై వరుణ్ చక్రవర్తి తీవ్ర ఆగ్రహం



ఐపీఎల్ 2026లో భాగంగా ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ తీవ్ర ఉత్కంఠతో పాటు స్టేడియంలో హైవోల్టేజ్ డ్రామాకు వేదికైంది. ముంబై ఇన్నింగ్స్ సమయంలో కేకేఆర్ ప్లేయర్ల మధ్య జరిగిన ఓ పొరపాటు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఫామ్‌లో ఉన్న ముంబై బ్యాటర్ తిలక్ వర్మ ఇచ్చిన ఓ సులువైన క్యాచ్‌ను కేకేఆర్ ఫీల్డర్లు నేలపాలు చేశారు. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఆ క్యాచ్‌ను రెండు చేతులతో సురక్షితంగా అందుకునే సమయానికి వికెట్ కీపర్ అంగ్క్రిష్ రఘువంశీ చేసిన అత్యుత్సాహం వల్ల ఆ క్యాచ్ చేజారింది. ఫీల్డింగ్ సమయంలో వరుణ్ చక్రవర్తి క్యాచ్ కోసం ముందే కాల్ ఇచ్చినప్పటికీ.. అంగ్క్రిష్ రఘువంశీ బంతిని క్యాచ్ పట్టుకోవడానికి వరుణ్ వైపు దూకాడు. ఈ క్రమంలో ఇద్దరు గట్టిగా ఢీకొనడంతో వరుణ్ చక్రవర్తి చేతుల్లో పడిన బంతి కాస్తా కిందపడిపోయింది. తాను పట్టుకున్న క్యాచ్ ను కీపర్ నిర్లక్ష్యం వల్ల చేజార్చుకోవాల్సి రావడంతో వరుణ్ చక్రవర్తి స్టేడియంలోనే రఘువంశీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ ఊహించని ఘర్షణ, డ్రామాను చూసి స్టేడియంలోని అభిమానులతో పాటు టీవీ ప్రేక్షకులు సైతం షాక్‌కు గురయ్యారు. అయితే ఈ క్యాచ్ డ్రాప్ వల్ల కేకేఆర్ జట్టుకు పెద్దగా నష్టం జరగలేదు. లభించిన లైఫ్ లైన్‌ను ముంబై బ్యాటర్ తిలక్ వర్మ అస్సలు ఉపయోగించుకోలేకపోయాడు. ఈ సీజన్‌లో ఇప్పటికే ఓ అద్భుతమైన సెంచరీతో ఫామ్‌లో ఉన్న తిలక్.. ఈ మ్యాచ్‌లో మాత్రం తీవ్రంగా నిరాశపరిచాడు. కేవలం 20 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. తిలక్ వర్మ తక్కువ పరుగులు చేయడం ఒకెత్తయితే.. టీ20 మ్యాచ్‌లో వన్డే కంటే ఘోరంగా అత్యంత నిదానంగా బ్యాటింగ్ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

# మెగాస్టార్ హీరోగా 158వ చిత్రం

## క్లాప్ కొట్టిన తమ్ముడు పవన్ కళ్యాణ్






మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం గురువారం మొదలైంది. కె.ఎస్.రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై కె. నారాయణ నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ క్లాప్ కొట్టారు. చిరంజీవి కుమార్తె సుస్మిత కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు వి.వి.వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసక్తికర విషయాలు చోటు చేసుకున్నాయి. అన్నపూర్ణ స్టూడియోకు చిరంజీవి, తన సోదరుడు పవన్‌కల్యాణ్ ఒకే కారులో వచ్చారు. తదుపరి నాగబాబు జాయిన్ అయ్యారు. ముగ్గురు కలిసి ఒకే సోఫాలో కూర్చుని చక్కగా ముచ్చటించుకున్నారు. చిరంజీవి పక్కన ఉన్నంత సేపు పవన్ ఎంతో వినయంగా ఉన్నారు. ఈ దృశ్యాన్ని చూసి అభిమానులు సంబరపడిపోయారు. చాలాకాలం తర్వాత ముగ్గురు సోదరులను ఒకే వేదికపై చూడటం కనుల విందుగా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలాగే చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్ ఫొటోలను చిత్రించిన పట్టు శాలువాతో చిరంజీవిని సన్మానించింది చిత్ర బృందం. మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. పవన్‌కల్యాణ్‌కి భక్తుడైన బండ్ల గణెశ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బండ్లను చూడగానే పవన్ దగ్గరకు తీసుకుని భుజంపై చేయి వేసి మాట్లాడుతూ లోపలికి తీసుకెళ్లారు. ఆ కాసేపు బండ్ల మొహం హై వోల్టేజ్ బల్బ్‌లా వెలిగిపోయింది. ఎప్పటిలాగే వినయంగా చేతులు కట్టుకుని మాట్లాడారు బండ్ల గణెశ్. చిరంజీవి సైతం బండ్లను హత్తుకున్నారు. అభిమానులు మాత్రం 'బండ్లన్నకు ఇవాళ పండగే.. ఆయన అభిమానించే హీరోలతో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఈ రోజు ఆయనకు నిద్ర పట్టదేమో' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి అనశ్వర రాజన్ కూడా హాజరయ్యారు. ఈ చిత్రంలో ఆమె చిరుకు కుమార్తెగా కనిపించనున్నట్లు టాక్ నడుస్తోంది.




## డ్రాగన్‌కు 64 మిలియన్ల వ్యూస్

పొరపాటున కూడా నా కలలోకి రావొద్దు' అంటూ రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్. ఆయన ప్రధాన పాత్రలో ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డ్రాగన్' తారక్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి మొదటి అప్‌డేట్‌గా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 4 నిమిషాలు ఉన్న ఈ వీడియో సోషల్ మీడియాను షేక్ చేసింది. ఇప్పుడు రికార్డును కూడా నమోదు చేసింది. 24 గంటల్లో 'డ్రాగన్' గ్లింప్స్ 64 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకున్నట్లు టీమ్ తెలిపింది. ఇప్పటివరకూ ఇండియాలో ఏ సినిమా గ్లింప్స్‌నకు ఇన్ని వ్యూస్ రాలేదని వెల్లడించింది. ఇది ఆల్‌టైం రికార్డు అంటూ పోస్టర్ విడుదల చేసింది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులో మరిన్ని రికార్డులు రావడం ఖాయమంటూ ఫ్యాన్స్ భావిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన గ్లింప్స్‌లో ఎన్టీఆర్ 'డ్రాగన్'గా రక్తపాతం సృష్టించే శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. విజువల్స్ ప్రత్యేకమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరించాయి. 'కె.జి.ఎఫ్' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించిన దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్' తర్వాత తెరకెక్కిస్తున్న సినిమా ఇది. ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది.

-------



## అభిమానికి క్షమాపణ చెప్పిన వరుణ్ ధావన్.. నెట్టింట ప్రశంసల వర్షం

బాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ ధావన్ తన అభిమాని పట్ల చూపిన చొరవ, చెప్పిన క్షమాపణ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. లక్నోలో జరిగిన ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో తనను కలవడానికి గంటల తరబడి ఎదురుచూసిన ఓ అభిమానిని కలవలేకపోయినందుకు ఆయన బహిరంగంగా విచారం వ్యక్తం చేశారు. హీరో స్పందించిన తీరుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.వరుణ్ ధావన్, ఆయన తండ్రి డేవిడ్ ధావన్ కాంబినేషన్‌లో వస్తున్న 'హై జవాని తో ఇష్క్ హోనా హై' సినిమా ప్రమోషన్ల కోసం చిత్రబృందం ఇటీవల లక్నోలో పర్యటించింది. ఈ కార్యక్రమంలో వరుణ్‌తో పాటు నటి మృణాల్ ఠాకూర్ కూడా పాల్గొన్నారు. తమ అభిమాన హీరోను చూసేందుకు ఫ్యాన్స్ భారీగా తరలివచ్చారు. అయితే, ఓ మహిళా అభిమాని.. తాము 5 గంటల పాటు ఎదురుచూస్తే, వరుణ్ కేవలం 5 నిమిషాల్లోనే వెళ్లిపోయారంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో పోస్ట్ చేసి తన నిరాశను వ్యక్తం చేసింది.ఈ పోస్ట్ వైరల్ అవ్వడంతో వరుణ్ ధావన్ వెంటనే స్పందించారు. అదే పోస్ట్‌కు బదులిస్తూ.. "క్షమించండి, నేను మీకు ఆటోగ్రాఫ్ ఇవ్వలేకపోయాను. పోలీసులు మమ్మల్ని కాస్త ముందుగానే అక్కడినుంచి పంపించేశారు" అని వివరణ ఇచ్చారు. దీంతో పాటు, ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో మరో వీడియో పోస్ట్ చేసి లక్నో అభిమానులందరికీ క్షమాపణలు తెలిపారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఏర్పాట్లతో పెద్ద వేదికపై కార్యక్రమం నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. స్టార్ హీరో అయి ఉండి కూడా ఒక సాధారణ అభిమాని పోస్ట్‌కు స్పందించి, క్షమాపణ చెప్పడం పట్ల నెటిజన్లు వరుణ్‌ను అభినందిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే మరో కథానాయికగా నటిస్తోంది.

## చిరుకు కూతురుగా అనస్వర

చిత్రపరిశ్రమలో ఎప్పుడు ఎవరిని అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. కొంతమందికివరుస విజయాలు అందుకున్నా కొన్నిసార్లు ఛాన్స్ లు రావు. మరికొంతమందికి ఒక్క సినిమా చేసినా మెగా ఛాన్స్ వచ్చేస్తోంది. తాజాగా మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ రెండో కేటగిరిలో ఉందని చెప్పొచ్చు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ కెరీర్ ను ప్రారంభించిన ఈ బ్యూటీ ప్రస్తుతం స్టార్ హీరోయిన్ గా కొనసాగుతోంది.ఛాంపియన్ సినిమాతో అనస్వర తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి మిక్స్డ్ టాక్ ను అందుకుంది. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా అనస్వర న్యాచురల్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అమ్మడికి టాలీవుడ్ లో మంచి భవిష్యత్ ఉంటుందని జోస్యం కూడా చెప్పారు. ఇప్పుడు ఆ జోస్యం నిజమైంది. ఈ చిన్నది తన రెండో సినిమానే మెగాస్టార్ చిరంజీవితో చేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి- బాబీ కొల్లి కాంబోలో వస్తోన్న చిత్రం మెగా 158. కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రం తాజాగా పూజా కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. ఈ ప్రారంభోత్సవంలో పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం విశేషం. చిరంజీవిపై చిత్రీకరించిన ప్రారంభ సన్నివేశానికి పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టారు. ఇక ఈ చిత్రంలో అనస్వర ఒక కీలక పాత్రలో నటించబోతోంది. చిరుకు కూతురిగా ఆమె నటిస్తోందని తెలుస్తోంది. మెగాస్టార్ సినిమాలో ఒక చిన్న పాత్ర చేసినా అది ఈ తరం నటీనటులకు అచీవ్ మెంట్ అని చెప్పొచ్చు. ఎన్నోఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్లకు రాని మెగా ఛాన్స్ రెండో సినిమాకే ఈ మలయాళ బ్యూటీకి దక్కడం నిజంగా ఆమె అదృష్టమని నెటిజన్స్ అంటున్నారు. ఏది ఏమైనా అనస్వర నక్కతోక తొక్కింది అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

------------------



## బాబీ డియోల్ బందర్ మూవీ




బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డియోల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ బందర్ . 'యానిమల్' సినిమాతో గ్లోబల్ స్థాయిలో తన పవర్‌ఫుల్ నటనతో ఆకట్టుకున్న బాబీ డియోల్, మరోసారి అంతకు మించిన ఇంటెన్స్ రోల్‌లో ఈ చిత్రం ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ట్రైలర్ చూస్తుంటే.. బాబీ డియోల్ ఈ సినిమాలో ఓ రాక్ స్టార్‌గా, విలాసవంతమైన జీవితాన్ని గడిపే 'ప్లేబాయ్' పాత్రలో కనిపిస్తున్నాడని తెలుస్తుంది. అయితే, అంతా సాఫీగా సాగిపోతున్న సమయంలో అతను అనుకోకుండా జైలు పాలు కావాల్సి వస్తుంది. అసలు బాబీ జైలుకు ఎందుకు వెళ్ళాడు? అతనిపై కేసు పెట్టిన ఆ యువతి ఎవరు? అనే ఆసక్తికర అంశాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇక ఈ చిత్రంలో బాబీ డియోల్‌తో పాటు సన్యా మల్హోత్రా, సబా ఆజాద్ మరియు సప్నా పబ్బి కీలక పాత్రల్లో మెరుస్తున్నారు. ఈ సినిమాకు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహిస్తుండగా.. నిఖిల్ ద్వివేది మరియు అనురాగ్ కశ్యప్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అన్ని హంగులతో, హై వోల్టేజ్ డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్రం 2026, జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. బాబీ డియోల్ కొత్త మేకోవర్ చూస్తుంటే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఉప్పెనను మించిన ట్విస్ట్ ఉంటుంది



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా బుచ్చిబాబు, రామ్ చరణ్ కార్ డ్రైవ్ చేస్తూ ఇంటర్వ్యూ నిర్వహించారు. 'మీకు ఇష్టమైన ఎపిసోడ్ ఏది?' అని దర్శకుడు అడగ్గా.. 'ఢిల్లీ ఎపిసోడ్ చాలా బాగుంటుంది. సినిమాలో నాకు ఇష్టమైన పార్ట్ అది. 'పెద్ది' మొత్తంలో ఎక్కువ మలుపులు ఉండేది ఆ ఎపిసోడ్‌లోనే కదా.. ఉప్పెనలో ట్విస్ట్ కంటే 100రెట్లు ఎక్కువ ఉంటుంది ఆ ఎపిసోడ్ అని చెప్పారు

----

